

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం

14 నవంబర్ 2025 పేజీలు : 08


## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం
- అధికారులందరూ సమర్థవంతంగా పనిచేయాలి
- రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యత విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు అధికారులను హెచ్చరించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం నెల్లూరుకు విచ్చేసిన ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు నగరంలోని పౌరసరఫరాల శాఖ స్టాక్ పాయింట్, ఇందిరాగాంధీనగర్ లోని రేషన్ షాపు, దర్గామిట్టలోని ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాన్ని అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ ను తనిఖీ చేసి 1/2 కేజీ చక్కెర ప్యాకెట్లలో గ్రామాల్లో చక్కెర తక్కువగా ఉండడాన్ని గుర్తించారు. హమాలీలతో జీతాల విషయమై మాట్లాడారు. చక్కెర తక్కువగా ఉన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఇందిరా గాంధీ నగర్ లోని రేషన్ షాప్‌ను తనిఖీ చేసి ఈ పోస్ మిషన్‌లో సాంకేతిక లోపాలను గుర్తించారు. కార్డుదారులందరికి ప్రభుత్వ నిబంధనల మేరకు బియ్యం, చక్కెర అందించాలని సూచించారు. దర్గామిట్టలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. గడువు ముగిసిన సాల్ట్ ప్యాకెట్లను గుర్తించి హాస్టల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. మరుగుదొడ్లకు తలుపులు లేవని, శుభ్రంగా లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఫుడ్ కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. కోడిగుడ్ల బరువు కూడా తక్కువగా ఉందని ఆయన గుర్తించారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందించే ఆహార విషయంలో అశ్రద్ధగా ఉన్నా, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా

-మిగతా 2లో

### ప్రజలకు వీపీఆర్ నేత్ర

## అద్వితీయ సేవలు

- ప్రారంభించిన నాటి నుంచి 12వ తేదీ వరకు 1599 మందికి కంటి పరీక్షలు
- 63శాతం మందికి కంటి అద్దాల అందజేత
- వందలాది మంది ప్రజల కంటిచూపులు మెరుగుపరుస్తున్న వీపీఆర్ నేత్ర
- రోజుకో పంచాయతీ చొప్పున ప్రజలకు సేవలు




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

పేద ప్రజల కంటిచూపు మెరుగుపరిచే విధంగా ఉన్నత ఆశయంతో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రారంభించిన విపిఆర్ నేత్ర అద్వితీయ సేవలు అందిస్తుంది. ప్రజలకు కంటి పరీక్షలు చేసే విషయంలో అత్యంత కచితత్వంతో పరీక్షలు చేస్తూ ఉచితంగా కంటి అద్దాలు

-మిగతా 2లో

### వారం పదిరోజుల్లో పెన్నా పొర్లుకట్ట

## నిర్మాణాన్ని పూర్తిచేస్తాం..

- పెన్నా పొర్లుకట్టను పటిష్టంగా నిర్మాణం చేస్తున్నాము..
- టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పొట్టేపాళెం గ్రామంలో పెన్నా పొర్లుకట్టను టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారీ తుఫాను వచ్చినా.. ప్రజలకు ఇబ్బంది లేకుండా పొర్లుకట్టను ఎత్తు పెంచడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే గతంలో భారీ తుఫాన్లు వచ్చినప్పుడు నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో పొర్లుకట్టను పటిష్టంగా నిర్మించడం జరుగుతుందని తెలియజేశారు. అదేవిధంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మొన్న భారీ తుఫాను వచ్చినా ప్రజలకు ఎక్కడా ఏ ఇబ్బంది లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అందరం కలసికట్టుగా

-మిగతా 2లో

## నివాసాల మధ్య నీటిమడుగు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :**

వింజమూరు పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీ చెరువు లోతట్టు ప్రాంతంలో నివాసాల మధ్య కాలనీ స్థలాలలో నిలిచిన వర్షపు నీరు ఇబ్బందికరంగా మారింది ఖాళీగా ఉన్న స్థలాలలో చేరిన నీరు బయటికి వెళ్ళే అవకాశం లేకపోవడంతో నీటిలో దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. దాంతో పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. బీసీ కాలనీలో కొంతమంది ప్లాట్లను ఎలాంటి నిర్మాణాలు చేయక పోవడంతో ఆ ప్రాంతం ఖాళీగా ఉండడం వల్ల ఆ ప్రాంతమంతా ఖాళీ స్థలాలలో దట్టంగా పిచ్చి మొక్కలు ముళ్ళ చెట్లు మొలిచాయి కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఆ ప్రాంతంలో పడ్డ వర్షపు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షపు నీరు నేటికి బయటకు పోయేందుకు వీలు లేక చిన్నపాటి గుంతలకు పరిమితమై అంతేకాకుండా ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారికి వైరల్ జ్వరాలు విష జ్వరాలు ప్రభలు తున్నాయి. తీవ్రమైన ఒళ్ళు నొప్పులతో పాటు జ్వరాలతో మంచం పడుతున్నారు ఇప్పటికైనా అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించి కాలి ప్లాట్ లలో నిలిచిన నీరును బయటకు పంపి ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇచ్చి నిర్మాణాలు చేపట్టకపోతే ప్లాట్లు రద్దుచేసి వేరొకరికి మంజూరు చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

### సర్వేపల్లి టీడీపీ కార్యకర్తల

## ఉత్సాహం ఉప్పొంగింది

**కార్యకర్తల రుణం తీర్చుకుంటాం ఎమ్మెల్యే సోమిరెడ్డి**



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :**

మండలంలోని చెముడుగుంటలోని శ్రీడ్స్ కళ్యాణ మండపంలో సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ప్రారంభంలో పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం అన్ని కమిటీల సభ్యులతో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో అత్యంత ఇబ్బందులు పడ్డది సర్వేపల్లి కేడరేనని, అక్రమ కేసులు, అరాచకాలు, దోపిడీని ఎదుర్కొని ధైర్యంగా పోరాడిన టీడీపీ కార్యకర్తలు నిజమైన వీరులని అన్నారు. చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రిగా రావాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని లక్ష్యంగా పెట్టుకొని కార్యకర్తలు పోరాడారు. సర్వేపల్లి కేడర్ చేసిన త్యాగాలకు నేను, పార్టీ రుణపడి ఉన్నాం, అని తెలిపారు. రీసర్వే పేరుతో టీడీపీ సానుభూతిపరుల భూముల రికార్డులు మార్చడం, ప్రభుత్వ భూములను కొంతమంది ధనవంతుల పేర్లపై రాయడం,

-మిగతా 2లో

# అండర్ పాస్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ

- టెండర్లు పిలవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్న ఎన్‌హెచ్ఏఐ అధికారులు
- వెహికల్ అండర్ పాస్ తీసుకువచ్చిన ఎంపీ వేమిరెడ్డికి ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు
- టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అవిశ్రాంత కృషితో జాతీయ రహదారి- 16 పై చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద వెహికల్ అండర్ పాస్ వచ్చిందని తెలుగుదేశం పార్టీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి అన్నారు. ఇందుకు సంబంధించి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ కూడా నవంబర్ 11న ఉత్తర్వులు జారీ చేసిందని, ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ కార్యాలయం అధికారులు టెండర్లు పిలవనున్నట్లు వెల్లడించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నో ఏళ్ల కల విపిఆర్ శ్రమతో నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు. మొత్తం ఆరు లైన్లుగా రహదారి ఉండనుందని చెప్పారు. వెహికల్ అండర్ పాస్ ఏర్పాటుతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని, రహదారి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉంటుందని పేర్కొన్నారు. నిత్యం భయంతో బతికే ప్రజలకు ఇది ఎంతో ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. ఈ ఏడాదిన్నర కాలంలో ఐదారుసార్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కలిశారని, ప్రజల క్షేమం కోసం పాటుపడే ఇలాంటి వ్యక్తి మరొకరు ఉండరని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో త్వరలోనే టెండర్లు పూర్తయి పనులు ప్రారంభమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి స్థానిక ప్రజల తరపున కేతంరెడ్డి వినోద్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# లైబ్రేరియన్‌లేని ఆత్మకూరు గ్రంధాలయం




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని జిల్లా గ్రంధాలయ సంస్థ శాఖా గ్రంధాలయం ఒకటిన్నర దశాబ్దకాలంగా లైబ్రేరియన్ లేకుండానే ఇన్‌చార్జ్‌తోనే కొనసాగిస్తున్నారు. 2009లో ఇక్కడ లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న ఏ.గోవిందరెడ్డి రిటైర్ అయ్యారు. నాటినుండి ఓంకారం శ్రీనివాసరాజు అనే లైబ్రేరియన్ మర్రిపాడు, సంగం, ఏఎస్‌పేటల్లో రెగ్యులర్ లైబ్రేరియన్‌గా, ఆత్మకూరు గ్రంధాలయ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. రెవిన్యూ డివిజన్‌కేంద్రం, నియోజకవర్గ కేంద్రం, వివిద శాఖల డివిజన్‌కేంద్రంగా, మండల కేంద్రంగా కొనసాగుతున్న ఆత్మకూరులో గ్రంధాలయానికి గ్రంధబాంధాగారి లేకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిలువెత్తుసాక్ష్యంగా ఉంది. దశాబ్దాలతరబడి ఆత్మకూరు గ్రంధాలయానికి స్వంత భవనం లేకుండా అద్దెభవనం కొనసాగుతుండగా నాలుగేళ్ళ క్రితం స్థానిక ఇందిరాగాంధీమహిళామండలి భవనాన్ని ఆభవ నిర్వాహకులు గ్రంధాలయానికి అప్పగించారు. అయితే లైబ్రేరియన్ మాత్రం ఇన్‌చార్జ్‌గా శ్రీనివాస రాజును కొనసాగిస్తున్నారు. శ్రీనివాసరాజు విధుల నిర్వహణలో అత్యంత చిత్తశుద్ధిగా వ్యవహరిస్తుంటారు. కానీ ఆయనను ఆత్మకూరుకు బదిలీచేయాలని పలువురు కోరుతుండగా ఆత్మకూరు గ్రంధాలయం బిక్యాటగిరిలో ఉందంటున్నారు. డివిజన్ కేంద్రంగా అనేక కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రవేటుపరంగా దాదాపు 30 విద్యాసంస్థలు, అదీగాక ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటిఐ, గురుకుల తదితర ప్రత్యేక విద్యా సంస్థలుండగా ఆత్మకూరు గ్రంధాలయాన్ని ఏ క్యాటగిరిగా మార్చకపోవడం విశేషం. అదీగాక ఆత్మకూరు గ్రంధాలయంలో వేలకొద్ది అన్ని రకాలు పుస్తకాలున్నాయి. అన్నివర్గాలకు అవసరమైన అన్ని పుస్తకాలున్నాయి. జిల్లాలో దాదాపు 50శాతం లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అటు ప్రభుత్వం, ఇటు జిల్లా గ్రంధాలయసంస్థ లేదా ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఆత్మకూరు గ్రంధాలయాన్ని ఏగ్రేడ్‌గా మార్చాలని, రెగ్యులర్ లైబ్రేరియన్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

# సర్వేపల్లి టీడీపీ కార్యకర్తల ఉత్సాహం ఉప్పొంగింది

*(మొదటి పేజీ తరువాయి)*

అమాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయడం వంటి అక్రమాలు వైసీపీ హయాంలో జరిగాయని విమర్శించారు. ఇన్ని పాపాలు చేసిన వారే ఇప్పుడు సిగ్గులేకుండా మాపై విమర్శలు చేస్తున్నారు. అని అన్నారు. కాకాణి చేసిన విమర్శలను ఖండించిన సోమిరెడ్డి, చంద్రబాబు నాయుడిపై చరిత్రహీనుడని మాట్లాడే అర్హత జగన్‌కి లేదా కాకాణికి లేదు. సీబీఐ కేసుల విచారణ ఎదుర్కొంటున్న వారే నోరు పారేస్తున్నారు అని వ్యాఖ్యానించారు. మెడికల్ కళాశాలలపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారానికి వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఇప్పటికే సమాధానం ఇచ్చారు. ఐదేళ్లు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డంగా తిన్నవారు ఇప్పుడు అరగక రోడ్లపైకి వచ్చి విమర్శలు చేస్తున్నారు.అని ఎద్దేవా చేశారు.ప్రతి కార్యకర్త రుణం తీర్చుకుంటూ ముందుకు సాగుతాం. సర్వేపల్లికి ఇప్పటికే మూడు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు వచ్చాయి. నియోజకవర్గ, మండల స్థాయి పదవులన్నీ భర్తీ చేస్తాం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుంది. అని సోమిరెడ్డి స్పష్టం చేశారు. ఈ




కార్యక్రమంలో సీనియర్ నాయకులు కుంకాల నాగేంద్రప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ రావూరు రాధాకృష్ణమనాయుడు, వెంకటాచలం మండల అధ్యక్షుడు కట్టం రెడ్డి రాధాకృష్ణారెడ్డి, సర్వేపల్లి రిజర్వాయర్ చైర్మన్ చల్ల నాగార్జున రెడ్డి, ఎస్సీ, ఎస్టీ అనుబంధ సంఘాలు మహిళా కార్యకర్తలు అందరూ పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



*(మొదటి పేజీ తరువాయి)*

ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. రుచిగా, శుచిగా పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు. హాస్టల్స్ కు సరఫరా అయ్యే వస్తువులను ముందుగా సరిచూసుకోవాలని, నిర్దిష్ట ప్రమాణాల మేరకు తూకం, వస్తువు గడువు తేదీ పరిశీలించుకోవాలని సూచించారు. రేషన్ షాపుల్లో గుర్తించిన సాంకేతిక సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పౌర సరఫరాల విషయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులందరూ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. తొలుత ఆర్ అండ్ బి అతిథి గృహంలో అధికారులతో ఫుడ్ కమిషన్ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఫుడ్ కమిషన్ సభ్యులు వెంట డీఎస్ఓ లీలారాణి, డిఎం అర్జున్ రావు, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్, బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, ఫుడ్ సేఫ్టీ అధికారి నీరజ, ఐసీడీఎస్ పిడి హేనాసుజన్, సమన్వయ అధికారి సైమన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వారం పదిరోజుల్లో పెన్నా పొర్లుకట్ట

# నిర్మాణాన్ని పూర్తిచేస్తాం..

*(మొదటి పేజీ తరువాయి)*

పనిచేయడం జరిగిందని తెలిపారు. అలాగే కార్యకర్తలు, నాయకులు నిత్యం ప్రజల్లో ఉండి, ప్రజా సమస్యల పరిష్కారానికి భరోసా కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, వేదగిరి లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, నెల్లూరు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, నెల్లూరు రూరల్ మండలం ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు వీపీఆర్ నేత్ర అద్వితీయ సేవలు





*(మొదటి పేజీ తరువాయి)*

అందిస్తూ వారి చూపును మెరుగు పరుస్తోంది. నవంబర్ 3న నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల చేతుల మీదుగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి వరికుంటపాడు మండలం రామాపురంలో విపిఆర్ నేత్రను అట్టహాసంగా ప్రారంభించారు. ప్రారంభించిన నాటి నుంచి 12వ తేదీ వరకు (ఆదివారం మినహా) ఇప్పటి వరకు వరికుంటపాడు మండలంలోని 8 పంచాయతీల్లో కంటి పరీక్షలు నిర్వహించారు. పంచాయతీల్లో దాదాపు 1599 మంది తమ చూపును పరీక్షించుకున్నారు. వారిలో 1000 మందికి అనగా 63 శాతం మందికి అద్దాలు అందించారు.

**నిర్విఘ్నంగా సేవలు :** వీపీఆర్ నేత్ర సేవలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. ఎక్కడా ఎలాంటి ఆటంకాలు లేకుండా సిబ్బంది ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. స్థానిక నాయకుల నుంచి, అలాగే ప్రజల నుంచి కూడా మద్దతు లభిస్తుందటతో సిబ్బంది అంతే ఉత్సాహంతో పనిచేస్తున్నారు. వరికుంటపాడు మండలంలో మొత్తం 24 పంచాయతీలు ఉండగా ఎనిమిది పంచాయతీల్లో సేవలు అందించింది. మిగతా 16 పంచాయతీల్లో సేవలు అందించేందుకు సిద్ధమవుతోంది.

నిర్విఘ్నంగా కొనసాగుతున్న ఈ సేవలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. తమ చూపును మెరుగుపరిచే విపిఆర్ నేత్రను సాదరంగా ఆహ్వానిస్తున్నారు.

# మండల టీడీపీ కమిటీ నేతల ప్రమాణ స్వీకారోత్సవం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు రూరల్ మండల తెలుగుదేశం పార్టీ నూతన కమిటిల కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఆత్మకూరు రూరల్ మండలంలోని మండల, గ్రామ, క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి నూతన కమిటీలకు ఎన్నికైన ప్రతినిధులు ఆత్మకూరులోని త్రికోటేశ్వర కళ్యాణ మండపంలో గురువారం సాయంత్రం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆత్మకూరు మండల రూరల్ పార్టీ అధ్యక్షులు సుంకర. పెంచల చౌదరి, పార్టీ సీనియర్ నాయకులు కేతా విజయభాస్కర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రమాణస్వీకార కార్యక్రమంలో నూతనంగా ఎంపిక కాబడిన కమిటీ సభ్యులతో పాటు మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నేతలు కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎంపిక కాపాడిన కార్యవర్గ సభ్యులను ప్రత్యేకంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మొదట తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిస్తూ పార్టీని కీర్తించారు. కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం వక్తలు మాట్లాడుతూ తమపై నమ్మకంతో తమకు ఈ పార్టీ పదవులు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు తమ నేత మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.. తమపై నమ్మకంతో ఇచ్చిన పదివిపై పార్టీ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లి వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం వివిధ స్థాయి నాయకులు వల్లూరు వెంకటరమణారెడ్డి, మద్దినేని నారాయణ, గార్లపాటి వేణుగోపాల్ నాయుడు, తలచీరు బాబునాయుడు, గోగిరెడ్డ్ పెంచల్ రెడ్డి, పెర్నాటి మాల్యాద్రి రెడ్డి, రమణమ్మ, మంతు యానాది రెడ్డి, రామిరెడ్డి మోహనరెడ్డి, కొండ్రెడ్డి రమణారెడ్డి, ఖాజావలి, మస్తాన్వాలి, నూతన కమిటీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వాలు, పాలకులు మారినా మెట్ట ప్రాంతమైన ఉదయగిరి ప్రజల తలరాతలు మారడంలేదని, ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం వంద కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఉదయగిరిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసి అభివృద్ధికి నాంది పలకాలని జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కె.వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో నాయకులు, సీనియర్ సిటిజన్లు, ప్రజా సంఘాలు, విద్యార్థులతో కలిసి పట్టణంలోని రంగనాయకుల ఆలయం నుంచి మెయిన్‌బజార్ గుండా పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు నినాదాలతో కూడిన భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం పంచాయతీ బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ.. ఆనాదిగా ఉదయగిరి ప్రాంతం ప్రభుత్వ నిర్లక్ష్యానికి, పాలకుల వివక్షకు గురవుతుందన్నారు. ఉదయగిరిని జిల్లా చేయాలని ఆరున్నరేళ్లుగా ఉద్యమాలు చేస్తున్నామన్నారు. కనీసం రెవెన్యూ డివిజన్ అయినా అవుతుందని తమ తపనన్నారు. ప్రస్తుతం ఎనిమిది మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉండడంతో ప్రజలు, రైతుల సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఏలాంటి అభివృద్ధి జరగడం లేదన్నారు. జిల్లాలో అతిపెద్ద నియోజకవర్గమైన ఉదయగిరిని రాష్ట్ర ప్రభుత్వం కావలి రెవెన్యూ' డివిజన్లో కలపాలని చూడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ద్వారా ప్రభుత్వానికి తమ ప్రాంత స్థితిగతులను వివరిస్తామని, అప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలన్నారు. లేదంటే దశల వారీగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇబ్బందులు తలెత్తకుండా సీఐ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డీఎంహెచ్చ్ మాశిలామణి. యూడి ఎఫ్ ప్రతినిదులు బాజా, శ్రీరావు చంద్రమూర్తి, జిల్లా సాధన సమితి నాయకులు దస్తగిరి ఆహ్మద్, రామిరెడ్డి, బాదర్ బాషా, జీశ్రీనివాసులరెడ్డి, గాజుల తాజుద్దీన్, భాస్కర్ రెడ్డి, జాపర్మొహిదీన్, ఎస్టానీ, ముర్తుజా సలీం, సందిరెడ్డి రామారావు. చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

## ఆప్షన్ త్రీ గృహాలలో గృహప్రవేశాలు జరగలేదు..

- గృహప్రవేశాలు ఒక మాయాజాలం
- బీజేపీ నేత మిడతల రమేష్

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఆప్షన్ వన్ -టూ ఇళ్లలో మాత్రమే గృహప్రవేశాలు ఏర్పాటు చేసి హౌసింగ్ అధికారులు ఒక మాయ సృష్టించారని బీజేపీ నేత మిడతల రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ గృహాల గృహప్రవేశాలు జరిగాయి. కట్టుకోలేని పేదల గృహాలను ప్రభుత్వం కాంట్రాక్టర్లచే నిర్మించబడిన గృహాలలో మాత్రం గృహప్రవేశాలు జరగలేదు. హౌసింగ్ ఉన్నతాధికారులు తమ జ్ఞానానంత ఉపయోగించి కేంద్రం ఇచ్చిన నిధులతోపాటు సొంతంగా కొంత డబ్బులు సమకూర్చుకొని నిర్మించిన గృహాలలో మాత్రమే గృహప్రవేశాలు జరిగేటట్లు వ్యూహరచన చేశారు. గత ఆరు సంవత్సరాలుగా 18లక్షల పైచిలుకు పేదల గృహాలు కేంద్రం నిధులతో నిర్మిస్తున్నారు. వాటిలో ఆప్షన్ 3 క్రింద 3,50,000 నిర్మాణాలు చేపట్టారు. ఈ గృహాలన్నీ అసంపూర్ణంగానే ఉన్నాయి. రాష్ట్రంలో అన్ని లేఔట్లలో తలుపులు కిటికీలు, నీటి, కరెంటు, పూత పనులు, సానిటరీ, ఈ వసతులు ఏమి కల్పించకుండా విస్మరించారు. ఈ గృహాలలో లబ్ధిదారులు సొంతంగా డబ్బులు పెట్టుకునే పరిస్థితి లేదు. ఆ నిర్మాణంలు ఎలా పూర్తి చేస్తారో హౌసింగ్ అధికారులు చెప్పాలి. మంత్రులు శాసనసభ్యులు చేసిన ప్రారంభోత్సవాలు పరిశీలిస్తే కేంద్ర నిధులతో మాత్రమే కాకుండా లబ్ధిదారుల సమకూర్చుకున్న డబ్బులతో నిర్మించిన ఆడంబరంగా కనబడే గృహాలలో గృహప్రవేశలు జరిగాయని అర్థమవుతుంది. పేదల కల సహకారం అయ్యేందుకు వెంటనే రాష్ట్రంలోపేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి బిజెపి నేతలు మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు.

## పేకాట రాయుళ్లు అరెస్ట్



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండలంలోని గోనుపల్లి గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఎస్ఐ ఎం.వెంకటరాజేష్ అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాపూరు మండలంలోని గోనుపల్లి గ్రామంలో పేకాటజూదం స్థావరంపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి వద్దనుండి రూ.20,100లు స్వాధీనం చేసుకున్నారు.

# ఉడ్ కొరత లేకుండా చర్యలు : డీఎఫ్ఓ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి చెక్క నగిషీ కేంద్రంలో కళాకారులు తయారు చేసే చెక్క నగిషీ వస్తువులకు సంబంధించిన ఉడ్ కొరత లేకుండా సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్థానికంగా ఉడ్ బ్యాంకు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి కె.మహబూబ్ బాషా పేర్కొన్నారు. పట్టణంలోని దిలావర్భాయ్ వీధిలో గల చెక్క నగిషీ కేంద్రాన్ని గురువారం సందర్శించి కళాకారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కర్రతో బొమ్మలు, చెక్క నగిషీలు, పలు రకాల వస్తువులు తయారు చేసే కేంద్రాలున్నాయన్నారు. కళాకారులకు వస్తువులు తయారు చేసేందుకు తగినంత ఉడ్ సరఫరా లేక కళను వదిలేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. వారికి తగిన సహకారమందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కళాకారులు తయారు చేసే చెక్క కొరత లేకుండా అందుబాటులో ఉంచేందుకు ఉడ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు చేపడుతుందన్నారు. ఉదయగిరి చెక్క నగిషీ కేంద్రంలో పలు రకాల ఆకర్షణీయమైన వస్తువుల తయారీకి నెర్ది, బిల్లనెర్ది, కలివి, వేప కర్రను ఉపయోగిస్తున్నారు. వాటిని రిజర్వు ఫారెస్టుతోపాటు రైతుల పొలాల నుంచి సేకరిస్తున్నారన్నారు. ఆటవీ ప్రాంతం నుంచి ఆయా చెట్ల కర్రను తరలిస్తే భవిష్యత్తులో ఆయా జాతులు అంతరించే పోతాయన్నారు. అలా కాకుండా కళాకారులు తయారు చేసే చెక్క నగిషీ వస్తువులకు సంబందించి ఏడాది ఎంత కర్ర అవసరమవుతుందని తెలుసుకొని అందుకనుగుణంగా అటవీశాఖ ద్వారా ఉడ్ బ్యాంకు ఏర్పాటు చేసి ఆయా జాతుల మొక్కలను పెంచి వారికి సరఫరా చేసేందుకు తగిన వివరాలు సేకరించటం జరిగిందన్నారు. కళాకారుల అభిప్రాయాలను సైతం తెలుసుకొని అందుకనుగుణంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్ఓ శ్రీకాంత్రెడ్డి, ఎఫ్ఎస్వీ చిన్నవెంకటయ్య, ఎఫ్బీఓ లక్ష్మీప్రసన్న, ఏబీవో వెంకటేశ్వర్లు, కేంద్ర నిర్వాహకురాలు గౌషియాబేగం తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రపంచ మధుమేహ దినోత్సవం

- ముందస్తు గుర్తింపు, జీవనశైలి మార్పులే కీలకం




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రతి సంవత్సరం నవంబర్ 14న జరుపుకునే ప్రపంచ మధుమేహ దినోత్సవం, మధుమేహంపై అవగాహన పెంపు, ముందస్తు గుర్తింపు, నివారణ చర్యల ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. మధుమేహం ఇప్పుడు పెద్దవారికే కాకుండా యువతలో కూడా వేగంగా పెరుగుతోందని తాజా గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 20 ఏళ్ల లోపు 11 లక్షల మందికి పైగా పిల్లలు, యువకులు టైప్-1 మధుమేహంతో బాధపడుతున్నారు. అలాగే 15-19 ఏళ్ల వయసులో టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం గత మూడు దశాబ్దాలలో రెండింతలు పెరిగింది. దీనిపై నెల్లూరు మెడికవర్ హాస్పిటల్స్ డాక్టర్స్ బృందం డాక్టర్ రవేంద్ర రెడ్డి, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ పెంచల్ ప్రసాద్, డాక్టర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. 'మధుమేహం చిన్న వయసులోనే ఎక్కువగా కనిపించడం ఆందోళనకరంగా ఉందన్నారు. ముందస్తు గుర్తింపు, క్రమమైన పరీక్షలు, ఆరోగ్యకరమైన జీవనశైలి అనుసరించడం ద్వారా దీర్ఘకాలిక సమస్యలను నివారించవచ్చు' అని తెలిపారు. మధుమేహానికి సూచించే ప్రధాన లక్షణాలు, అధిక దాహం, తరచూ మూత్ర విసర్జన, బరువు తగ్గడం, అలసట, గాయాలు ఆలస్యంగా మానడం. అధిక బరువు, కుటుంబ చరిత్ర, రక్తపోటు లేదా వ్యాయామం లేకపోవడం వంటి ప్రమాదకర అంశాలు ఉన్నవారు క్రమం తప్పకుండా రక్త చక్కెర పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. డాక్టర్లు మధుమేహ కట్టడికి నివారణ, నిర్వహణకు ముఖ్యమైన చర్యలు గురించి వివరిస్తూ సమతుల్య ఆహారం, పిండి పదార్థాలు, కూరగాయలు, తేలిక ప్రోటీన్లతో కూడిన ఆహారం తీసుకోవాలి అన్నారు. నిత్య వ్యాయామం, రోజూ కనీసం 30నిమిషాలు శారీరక వ్యాయామం చేయాలి. ధూమపానం, మద్యం మానేయాలిబీ ఒత్తిడిని నియంత్రించుకోవాలి అని వైద్యుల సూచనల ప్రకారం మందులు, పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలని తెలిపారు.

# సుందరయ్య కాలనీ హైవే నందు అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని ధర్నా




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని సుందరయ్య కాలనీ నేషనల్ హైవే వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ 23, 24 డివిజన్ శాఖల ఆధ్వర్యంలో నేషనల్ హైవే మీద జాతీయ రహదారి పై ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ.. జాతీయ రహదారి ఏర్పాటు చేసి దాదాపు 22 సంవత్సరాలు పూర్తయింది. సుందరయ్య కాలనీ వద్ద బాక్స్ టైప్ బ్రిడ్జి లేక పోవడం వలన సుందరయ్య కాలనీ వద్ద జరిగిన ప్రమాదాలలో అనేకమంది మరణించారు. ఇక్కడ భారత జవాన్లు కూడా మృతి చెందడం బాధాకరం. ఈ రెండు డివిజన్లో పరిధి లోని పడారుపల్లి, సుందరయ్య కాలనీ, ఆర్‌డిటి కాలనీ, హౌసింగ్ బోర్డ్, కల్లూరుపల్లి, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో దాదాపు 5వేల కుటుంబాలు నివాసం ఉంటున్నారు. వీళ్లంతా ప్రతినిత్యం రోజువారి పనులు నిమిత్తం హైవే దాటుకుని నెల్లూరు నగరానికి రోజువారి పనులు నిమిత్తం రాకపోగా కొనసాగిస్తున్నారు. పడారుపల్లి రైతులు వ్యవసాయ ఆధారిత పనులు నిమిత్తం హైవేపై నిత్యం రాకపోకలు కొనసాగిస్తున్నారు. గొలగమూడి రోడ్‌లోనే ఫ్లైఓవర్ బ్రిడ్జి పూర్తయిన తర్వాత, సుందరయ్య కాలనీ దిగువున ఉన్న ప్రాంతాల వారి యొక్క ఇళ్లకు చేరుకోవ డానికి గొలగమూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి తిరిగి రావాల్సిన పరిస్థితి ఉంది. అత్యవసర సమయాల్లో ఇక్కడ నుండి పోవాలన్నా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజల ప్రాణాలు కాపాడే దానికి, సుందరయ్య కాలనీ హైవే వద్ద అండర్పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కే.పెంచల నరసయ్య, కే.సతీష్, ఓ.సుధీర్, ఎస్కే షాహినా బేగం, కండె కోటేశ్వరరావు, సురేష్, వీర్ల శ్రీనివాసులు, చైతన్య, చంద్రమౌళి, బాపనయ్య, మదన్, వెంకటసుబ్బయ్య, మురళి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామ స్థాయి కమిటీల ప్రమాణస్వీకారం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి తెలుగుదేశ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు, రాష్ట్ర దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనల మేరకు మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని శ్రీ కామాక్షి కళ్యాణ మండపంలో మండల, క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామస్థాయి కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఏఎస్పేట మండల టీడీపీ కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటిస్తూ పార్టీని కీర్తించారు. అనంతరం నూతనంగా ఎంపిక కాబడిన కమిటీ కార్యవర్గ సభ్యులచే పీఏసీఎస్ అధ్యక్షులు కే.నరసింహారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతనంగా కాపాడిన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో తమకు ఈ పార్టీ పదవులు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు తమ నేత రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తమపై నమ్మకంతో ఇచ్చిన పదవిపై పార్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు పులిమి సుధాకర్‌రెడ్డి టీడీపీ సీనియర్ నాయకులు కంచర్ల శ్రీహరి నాయుడు ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా మండల టీడీపీ నాయకులు అల్లంపాటి మాధవరెడ్డి దేవరాల హజరతయ్యా దామెర అనిల్ కుమార్ షేక్ జిలాని భాష సూరం నవీన్ సూరం జనార్ధన్ రెడ్డి నరసయ్య షేక్ షబ్బీర్ అల్లంపాటి సుబ్బారెడ్డి మండలంలోని సర్పంచులు నాయకులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సచివాలయాలను కమిషనర్ తనిఖీ

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ గురువారం స్థానిక 35/1 రాజీవ్ గృహకల్ప సచివాలయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్, ఆన్లైన్ అటెండెన్స్ పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రతి కార్యదర్శి ఎంక్వయిరీ లేదా ఫీల్డ్ విజిట్ రెండు సందర్భంలో మూమెంట్ రిజిస్టర్ నందు తప్పకుండా నమోదు చేయాలని, నిర్దేశించిన సమయంలో అటెండెన్స్ నమోదు చేసుకోవాలని, క్రమం తప్పకుండా ఫీల్డ్ విజిట్ నిర్వహించాలని, పనివేళల యందు ప్రజలకు కార్యదర్శులు అందరూ సచివాలయాల యందు అందుబాటులో ఉండాలని, ప్రతి రోజు మూడు గంటల నుండి నాలుగు గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ ఆదేశాలమేరకు నగరపాలక సంస్థ సెక్రటరీ శ్రీలక్ష్మి బషీర్ నగర్, సంజయ్ గాంధీ నగర్, వెంగళరావు నగర్ సచివాలయాలను



ఆకస్మికంగా తనిఖీ చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్ హిమబిందు 20/1 టైలర్స్ కాలనీ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరపాలక సంస్థలోని పలు అధికారులు కమీషనర్ ఆదేశాలమేరకు వివిధ సచివాలయాలను ఆకస్మి కంగా తనిఖీ చేసి కార్యదర్శులకు తగు సూచనలు ఆదేశాలు జారీ చేశారు.



# ఆక్రమణలపై మార్కింగ్ చేసిన అధికారులు

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక కొత్తూరు హెచ్.ఆర్ కళ్యాణమండపం నుంచి తెలుగు గంగ కాలువ కార్యాలయం వరకు ఉన్న రోడ్డు ఆక్రమణలను తొలగించే కార్యక్రమాలలో భాగంగా గురువారం మార్కింగ్ చర్యలను చేపట్టారు. రోడ్డు ఆక్రమణలను పాత రోడ్డు 80 అడుగుల నుంచి 100 అడుగుల వరకు విస్తరణ పనుల కొరకు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టామని ఈ సందర్భంగా కమిషనర్ తెలియజేశారు.

# అపస్మా స్పోర్ట్స్ మీట్ బ్రోచర్‌ను ఆవిష్కరణ




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండల కేంద్రంలోని ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో మనోహర్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న నియోజకవర్గ స్థాయి అపస్మాస్పోర్ట్స్ మీట్ సందర్భంగా, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ని ప్రత్యేక అతిథిగా ఆహ్వానించి, ఎమ్మెల్యే చేతుల మీదుగా స్పోర్ట్స్ మీట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ అపస్మా అధ్యక్షులు కేవీ రత్నం నియోజకవర్గ కరస్పాండెంట్స్ పోలు అంకిరెడ్డి ఎస్.ఐజాక్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులో గురువారం ఎస్ఐ వీర ప్రతాప్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై యువతకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఎస్పీ అజిత వేజెండ్ల, డీఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రజలు అతివేగం, మద్యం సేవించడం, సెల్ ఫోన్లు మాట్లాడుతూ ప్రయాణించడం ప్రమాదాల కారణమవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా హెల్మెట్లు లేకుండా ప్రయాణించడం కూడా ప్రమాదాన్ని కారణమవుతుందని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ పొంది ప్రయాణించాలని తెలిపారు. అదేవిధంగా తల్లిదండ్రులు కూడా బాధ్యత వహిస్తూ పిల్లలకు బైకులు ఇవ్వకుండా జాగ్రత్త పడాలని ఒకరిద్దరి కంటే ఎక్కువగా ప్రయాణించడం ప్రమాదకరమన్నారు. అదేవిధంగా ఆటోవాలాలు కూడా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం చాలా ఇబ్బందికరమని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. కావున తగిన జాగ్రత్తలు వహించి ప్రయాణించాలని తద్వారా రోడ్డు ప్రమాదాలు నివారించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆటోవాలాలు బైకు చోధకులు తదితరులు ఉన్నారు.

# ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఆస్తోతి నాగరాజు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** కంటేపల్లి గ్రామానికి చెందిన ఆస్తోతి నాగరాజు టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, సోమిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి, చౌటపాళెం పీఏసీఎస్ చైర్మన్ రావూరు రాధాకృష్ణమ నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు.

# ఎర్రగుంటలో క్యాన్సర్ అవగాహన సదస్సు




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్–4 ఆధ్వర్యంలో ఎర్రగుంటలో జరుగుతున్న ప్రత్యేక శిబిరం ఆరో రోజు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. హెూమి బాబా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వై.ప్రదీప్, డాక్టర్ వి.జీవన్ క్రాంతి కుమార్, డాక్టర్ ఏ.రాజేష్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం న్యాయవాది దాసరి ప్రసాద్ గౌడ్ పోక్సో చట్టంపై ప్రజలకు వివరించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చెట్లు నాటారు.

# పొట్టేపాళెం గ్రామంలో రచ్చబండ కార్యక్రమం

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నుండి గ్రామస్థాయి వరకు 45రోజులపాటు కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పొట్టేపాళెం గ్రామం నందు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ఉద్యమం సంతకాల సేకరణ కార్యక్రమం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పొట్టే పాళెం గ్రామం కార్యకర్తలతో కలిసి సేకరించడం జరిగింది. అనంతరం ఈ కార్యక్రమంలో ఆనం విజయ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 8వేల కోట్ల రూపాయలు ఖర్చు అయ్యేటువంటి పరిస్థితుల్లో 3 వేల కోట్ల రూపాయలతో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను శంకుస్థాపన చేయడం జరిగింది. అందులో 5 మెడికల్ కళాశాలలో పూర్తిస్థాయిలో ప్రారంభించడం జరిగింది. ఒక మెడికల్ కళాశాల అధ్యాపకుల నియమించకపోవడం వలన ప్రారంభం కాలేదు. మిగిలిన 11మెడికల్ కళాశాలలో వివిధ దశల్లో నిర్మాణం జరుగుతూ ఉన్నాయి. ప్రస్తుతం ఈ కూటమి ప్రభుత్వం ఈ 17 మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం చాలా దారుణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చెవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు రూరల్ మండల అధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, నెల్లూరు నగర అధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ నెల్లూరు మదన్ మోహన్ రెడ్డి, నెల్లూరు జిల్లా పంచాయతీ రాజ్ విభాగ సెక్రెటరీ వేమిరెడ్డి హరి శివారెడ్డి, జిల్లా ఆర్‌టిఐ విభాగ ఉపాధ్యక్షులు బండి శ్రీకాంత్ రెడ్డి,



జిల్లా సెక్రెటరీ బద్దెపూడి వెంకట్రావు, బోయిల్లా ఆదిరెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు అయిరెడ్డి సుబ్బారెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి నవీన్ కుమార్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జాషువా, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి, 23వ డివిజన్ ఇన్చార్జ్ మల్లికార్జున్ రెడ్డి, 32వ డివిజన్ ఇంచార్జ్ సయ్యద్ ముజాఫర్, 34వ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ ఇలియాజ్, పొట్టేపాళెం గ్రామ నాయకులు అల్లారెడ్డి రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు, అల్లారెడ్డి వినోద్, అల్లా రెడ్డి సురేందర్ రెడ్డి, చెన్నారెడ్డి వెంకటసుబ్బారెడ్డి, చెన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎడవల్లి సుధాకర్, ఎడవల్లి వెంకటేశ్వర్లు, అంబటి వెంకటేశ్వర్లు, కనుపూరు సుధాకర్ రెడ్డి, సుబ్బరామయ్య, నాయుడు శ్రీనివాసులు రెడ్డి, సంగం రాజేష్, రాంబాబు నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు రాజా రెడ్డి, నిసార్, సుధీర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, జావిద్, బాలాజీ, పసుపులేటి సుధాకర్, షేక్ చాన్ భాషా,అక్కన మదన్ మోహన్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించాలి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్) నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని సిటీ నియోజకవర్గం 117, రూరల్ నియోజకవర్గం 118లకు సంబంధించిన ఈఆర్ఓలు, అసిస్టెంట్ ఈఆర్ఓలు, సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో సిటీ నియోజకవర్గం 117 ఈఆర్ఓ వైఓ నందన్, రూరల్ నియోజకవర్గం 118 ఈఆర్ఓ అనూషలు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ సమావేశం పూర్తయిన అనంతరం ఈఆర్ఓ నందన్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ద్వారా అందుకున్న అన్ని ఓటరు దరఖాస్తులను పారదర్శకంగా విచారించి అర్హులను గుర్తించాలని సూచించారు. అర్హులైన వారి నమోదుకు జాబితాలను సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. బీఎల్ఓలు తమ పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలను సేకరించాలని, కుటుంబ సభ్యులంతా ఒకే పోలింగ్ కేంద్రంలో నమోదయ్యేలా జాగ్రత్తలు వహించాలని సూచించారు. స్థిర నివాసం లేని వారు, సంచార జాతి ప్రజలను గుర్తించి ఓటరు నమోదుకు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. దివ్యాంగులు, వయో వృద్ధులను గుర్తించి వారి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని ఈఆర్ఓ సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది సేకరించిన వివరాలను ఉన్నతాధికారులు పారదర్శకంగా పరిశీలించాలని, వివరాల పరిశీలనకు స్వయంగా గృహాలను సందర్శించి ఓటర్లతో ప్రత్యక్షంగా మాట్లాడాలని ఈఆర్ఓ సూచించారు.

# హెల్మెట్ వాడకంపై అవగాహన : సీఐ రాజేశ్వరరావు

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం నేమద్దూరుపాడు క్రాస్ రోడ్డు వద్ద గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ రాజేశ్వరరావు మాట్లాడుతూ.. హెల్మెట్ వాడడం వలన ఏ విధంగా మనం కుటుంబ సభ్యులు, ప్రయాణించే, వారు సుఖంగా ఉంటారు. హెల్మెట్ వాడకపోవడం వల్ల జరిగే ప్రమాదాలను గురించి ఎలా తప్పించుకోవాలని క్షుణ్ణంగా ద్విచక్ర వాహనదారులకు వివరించారు. హెల్మెట్ ఉండి ప్రమాదం జరిగినప్పటికీ మృత్యువు నుండి ఎలా తప్పించుకోవాలో తెలిపారు. హెల్మెట్ వాడి ప్రాణాలు రక్షించుకోవాలని కోరారు. అలాగే ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థిని, విద్యార్థులు తమ తల్లిదండ్రులు కష్టపడి సంపాదించి మంచి భవిష్యత్తు బిడ్డలకి ఉండాలని కోరుకొని వారు కష్టమైనా నష్టమైనా డబ్బులు తీసుకొచ్చి విద్యార్థికి వాహనం కొనిచ్చినప్పుడు ఇంటి నుంచి విద్యార్థి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేవరకు ప్రస్తుత పరిస్థితులు ఏం జరుగుతుందోనని



ఆందోళనలో ఉంటున్నారు. కాబట్టి ప్రతి విద్యార్థి, విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి సుఖంగా ప్రయాణం చేసి గమ్యస్థానాన్ని చేరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐలు తిరుమలరెడ్డి, బాజీ బాబు, బాలకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.



## సచివాలయాలు తనిఖీ చేసిన ఎంపీడీఓ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** చేజర్ల మండలంలోని ఆదురుపల్లి, నేర్నూరు సచివాలయాలను గురువారం ఎంపీడీఓ అమర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సమయపాలన పాటించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన హెచ్చరించారు.

## చెన్నుకు ఘన సత్కారం



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండల టీడీపీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన చెన్ను అశోక్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ మేరకు గురువారం చెన్ను గార్డెన్‌లో మండలంలోని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు చెన్ను అభిమానులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు చెన్ను అశోక్ రెడ్డికి అభినందనలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు రాజకీయాలకు అతీతంగా పెద్దఎత్తున చెన్ను గార్డెన్‌కి చేరుకొని రాపూరు మండల టీడీపీ అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డికి దుశాలువాలు కప్పి సన్మానించారు. తనకు అభినందనలు తెలిపిన ప్రతిఒక్కరికి మండల టీడీపీ అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## సఖి వన్ స్టాప్ సెంటర్‌కు ఆకస్మిక తనిఖీ




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి, ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.హేనసుజాన్ సఖి వన్ స్టాప్ సెంటర్‌కు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ వారితో మాట్లాడుతూ.. కలెక్టర్ రివ్యూ మీటింగ్‌లో చర్చించిన అంశాలు, ఆ కేసుకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత కేసులను సఖి కేసు వర్కులను ఫాలోఅప్ చేయాలని, అవసరమైతే బాధితుల ఇళ్లకు వెళ్లి డాక్యుమెంట్లు సేకరించాలని ఆమె ఆదేశించారు. పెండింగ్ వెంటనే క్లియర్ చేయాలనీ సూచించారు. తరువాత సఖీ కేంద్రంలో రిజిస్టర్ చేసిన కేసుల రికార్డులను పరిశీలించారు. అనంతరం డీవీసీ కార్యాలయ సిబ్బందితో సమావేశమై, వారు సమయానికి కార్యాలయానికి హాజరుకావాలని, వచ్చిన కేసులను తగిన సమయానికి పరిష్కరించాలని, అలాగే కార్యాలయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. అదనంగా డీవీసీ కార్యాలయ సిబ్బంది అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆమె ఆదేశించారు. ఈ సమా వేశంలో నోడల్ ఆఫీసర్ వీబీ అనురాధ సఖి అడ్మిన్ షైక్ షహనాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ కో కస్టర్ కన్వీనర్‌గా పాములపాటి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ మండల కస్టర్ కో కన్వీనర్‌గా మండలంలోని చంద్రపడియ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పాములపాటి మాలాద్రిని పార్టీ ప్రకటించింది. వింజమూరు మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో గడిచిన రెండు రోజులుగా జరుగుతున్న పార్టీ ప్రమాణ స్వీకారం మహోత్సవంలో పార్టీ అధిష్టానం సూచించిన మేరకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నాయకులు చే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పాములపాటి మాలాద్రి మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీలో ఒక కార్యకర్తగా పనిచేస్తున్న నాకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రోత్సాహంతో మండల క్లస్టర్ కో కన్వీనర్‌గా బాధ్యతలను అప్పగించడం పట్ల తాను ఎమ్మెల్యేకి పార్టీకి రుణపడి ఉంటానని పార్టీ అభివృద్ధికి తనవంతు సహకారాలు అందిస్తూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానని పార్టీలోని సీనియర్ల సలహాలు సూచనలు పాటిస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు.

# నూతన టీడీపీ కార్యవర్గ ప్రతినిధులకు ఘనసన్మానాలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో తెలుగుదేశం కమిటీలకు ఎన్నికైన ప్రతినిధులు ప్రమాణస్వీకారం చేయగా వారందరినీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. పరిశీలకులుగా విచ్చేసిన తెలుగుదేశం నెల్లూరు నగర నాయకుడు జాకీర్‌హుస్సేన్, ఇతర టీడీపీ రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులు నూతన కమిటీల ప్రతినిధులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. తొలుత పట్టణ టీడీపీ అధ్యక్షుడుగా ఎన్నికైన తుమ్మల చంద్రారెడ్డిని జాకీర్‌హుస్సాన్, తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, నియోజకవర్గ తెలుగుదేశం సీనియర్ నాయకుడు, జిల్లా సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు, చెర్లోయడవల్లి మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కౌన్సిలర్లు తదితరులు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం మున్సిపల్, వార్డు, క్లస్టర్, బూత్, యూనిట్ స్థాయిలో ఎన్నికైన ప్రతినిధులందరినీ శాలువాలతో నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్ సర్దార్, సీనియర్ తెలుగుదేశం నాయకుడు కేతా విజయభాస్కరరెడ్డి, స్థానిక సిండికేట్ రైతు సేవా సహకార సంఘ చైర్మెన్ పరిటాల సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ దోర్నాదుల సురేష్‌బాబు, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, పట్టణ తెలుగుమహిళ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి, పట్టణ టీడీపీ ప్రధానకార్యదర్శి తోడేటి వెంకటయ్య, కౌన్సిలర్ గౌస్‌బాషా, పట్టణ టీడీపీ మైనారిటీసెల్ అధ్యక్షుడు ఖాదర్‌బాషాలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ



కార్యదర్శి దావా పెంచలరావు, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, రాష్ట్ర టీడీపీ లీగల్‌సెల్ కార్యదర్శి ఎల్‌వి రమణయ్య, కౌన్సిలర్లు మాదాల శ్రీనివాసులునాయుడు, గంధళ్ళ వేణు, మహబూబ్ బాషా, నాయకులు చెరుకూరు పద్మావతమ్మ, గోరీ షబ్బీర్, కొప్పోలు చిన్నపురెడ్డి, కిన్నెర నరశింహరావు (శ్రీపెనుశిలనరశింహకోన ఫెస్టివల్ కమిటీ సభ్యులు), నాగులూరు చిన్నబ్బయ్య, పఠాన్ చాంద్‌బాషా, పల్లవోలు జయాకర్, వడ్లమూడి వజ్రమ్మ, కోటేశ్వరమ్మ, చిట్టమూరు వెంకటేశ్వర్లురెడ్డి, దాసరి మధుసూధనరావు, దాసరి బాలకృష్ణ, కాపా వెంకటసుబ్బయ్య, చిన్నా, హయత్‌బాషా, తోట సందీప్, అంబటి నాగేశ్వరరావు, పొన్నూరు హజరత్తయ్య, ప్రదీప్‌రెడ్డి, ఉసురుపాటి బాలకొండయ్య, సాగర్, ఒంటేరు మల్లికార్జున, నాగులూరు శ్రీనయ్య, గౌరిపర్తి నాగభూషణమ్మ, పట్టణ, వార్డు, యూనిట్, క్లస్టర్, బూత్‌కమిటీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 4న చలో విజయవాడ

**సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పందిటి సుబ్బయ్య మాదిగ**



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** మూడు దశాబ్దాల మాదిగ మహోత్సవ విజయోత్సవ సభను డిసెంబర్ 4న జింఖానా గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామని ఈ సభకు నెల్లూరు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందిటి సుబ్బయ్య మాదిగ పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని డాక్టర్ జగ్జీవన్ రామ్ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై 2024 ఆగస్టు ఒకటిన సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన తీర్పునిచ్చిందన్నారు. విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు హాజరవుతారని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం నెల్లూరు జిల్లాలో మాదిగలకు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించి నామినేటెడ్ పదవులు ఎమ్మెల్యే ఎంపీ స్థానాలు కేటాయించాలని కోరారు. మాదిగలకు అన్యాయం జరిగితే టిడిపికి కూడా తగిన గుణపాఠం నేర్పుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కుడుముల సుబ్బారావు, మన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు, కువ్వారపు నాగేశ్వరరావు, సాల్మాన్, తాటిపర్తి బాబు, కన్యకేశ్వరరావు, రియాజ్, నాగార్జున, తోట నాగరాజు, తుమ్మూరు నారాయణమ్మ, పల్లాల కార్తీక్, శేఖర్ పాల్గొన్నారు.

# ఘాట్రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని నిరసన

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ఉదయగిరి, బండగానిపల్లి ఘాట్రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని గురువారం సీపీఎం ఆధ్వర్యంలో కొండకింద గ్రామాల ప్రజలు ఆర్ అండ్ బీ కార్యాలయంలో నేలపై కూర్చొని నినాదాలతో కూడిన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ.. వర్గాలకు మాట్రోడ్డు మొత్తం కోతకు గురైందన్నారు. ఈ రహదారిపై సుమారు 11 గ్రామాలకు చెందిన 16వేల మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. రహదారి సరిగా లేక పోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దశాబ్దాలుగా అటవీ అనుమతుల్లేక 3.2 కిలోమీటర్ల మేర నిలిచిన రహదారి పనులు చేపట్టకపోవడం సిగ్గుచేట



న్నారు. అలాగే దున్నపోతులు వాగు వద్ద దెబ్బతిన్న వంతెన నిర్మించడంతోపాటు పలు గ్రామాల్లో చిద్రమైన రహదారులకు మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యాలయంలో సమస్యలు చెప్పుకునేందుకు అధికారులు అందుబాటులో లేకపోవడం దారుణమన్నారు. గ్రాస్తులు పాల్గొన్నారు.

# చేనేతలకు పరిహారం ఎందుకు ఇవ్వరు !

**బీజేపీ నేత మిడుతల రమేష్ డీఆర్‌ఓకు విజ్ఞప్తి**



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** బీజేపీ పోరాడి ఏర్పాటు చేస్తున్న చేనేత కాలనీలోనె వివక్ష కనబడుతుంది. చేనేతలకు తుఫాన్ సాయం పంపిణీలో వివక్షత కొనసాగుతుందని బీజేపీ నేత మిడతల రమేష్ నెల్లూరు డిఆర్‌ఓకు విజ్ఞప్తి చేశారు. పొదలకూరులో 27 సంవత్సరాల క్రితం బిజెపి ఆమరణ దీక్షతో చేనేత కాలనీ ఏర్పడింది. 110 కుటుంబాలు ఉండగా 40 కుటుంబాలు మగ్గం మీద ఆధారపడి జీవిస్తున్నాయి. ఆ రోజుల్లో అంబేద్కర్ కాలనీగా మేము నామకరణం చేస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాకాని రమణారెడ్డి కాలనీగా మార్చారు. ఆ పేరు చూసి అర్హులైన చేనేతలకు పరిహారం అందడం లేదో నని రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో 3800 కుటుంబాలు ఉండగా 800 కుటుంబాలకు మాత్రమే తుఫాన్ సహాయం అందించారు. జిల్లాలో అన్ని మండలాలలో చేనేతలు తమ గొంతుకను వినిపి స్తుండడంతో రెండవ జాబితా తయారు చేస్తున్నారు. ఈ జాబితాలో కూడా పొదలకూరు చేనేత కాలనీని చేనేత జ్యువలరీ శాఖ అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదని రమేష్ డిఆర్‌ఓకు వివరిం చారు. ఈ కార్యక్రమంలో బుధవరపు బాలాజీ, చింత గింజల సుబ్రహ్మణ్యం. నరాల సుబ్బారెడ్డి, సోమ గోపాల్, నారాయణ యాదవ్, నాగేంద్ర సింగ్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## అదృశ్యమైన యువతి ఆచూకీ లభ్యం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైన విషయంపై తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసిన విషయం విధితమే యువతి ఆచూకీ కోసం ఎస్ఐ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. టంగు టూరులో యువతి ఉన్నట్లు గుర్తించి ఉదయగిరికి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

## అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని ఆచార వీధిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న దద్దోలు మల్లికార్జున అనే వ్యక్తిని గురువారం అరెస్టు చేసిన ఎక్సైజ్ ఎస్ఐ జేకే వీఎన్ మురళీకృష్ణ అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి వద్దనుండి ఆరు మద్యం సీసాలను, ఒక ద్విచక్ర వాహనంను స్వాధీనం చేసుకొని అధినేతపై కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ఎస్‌కె అజిత్ భాష తదితరులు పాల్గొన్నారు. ముద్దాయిని పట్టుకున్న సిబ్బందిని అధికారులు ఈ సందర్భంగా అభినందించారు.

## టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా బొంత శ్రీనివాస్ యాదవ్



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి తెలుగుదేశం పార్టీకి 2024 ఎన్నికల్లో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గెలుపులో విశిష్ట పాత్ర పోషించిన బీసీ నాయకులు శ్రీనివాస్ యాదవ్ చేసిన సేవలకు పార్టీ గుర్తించి కావలి తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించడం జరిగింది. గురువారం జరిగిన సమావేశంలో నియామక పత్రాన్ని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ద్వారా అందుకున్నారు. అనంతరం బొంత శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. తను మీద నమ్మకం ఉంచి ఈ పదవి బాధ్యతలు అపచ్చి చెప్పినందుకు ఎమ్మెల్యే కావ్య కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నా వంతు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బీసీ నాయకులకు వెన్నంటే ఉంటానని వారి సమస్యలు పరిష్కారానికి ఎమ్మెల్యే సహకారం తీసుకుంటానని, ఎక్కడ కూడా ఎమ్మెల్యేకి అపకీర్తి తీసుకుని రానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## నలుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** టీడీపీ నాయకులు చేవూరు జగజీవన్ రావు సోదరి ప్రియాంక నలుగు కార్యక్రమం వారి గృహంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చివరి జగజ్జీవన్ రావు, వారి కుటుంబ సభ్యులు, వార్డు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## మర్రిపాడులో దేవరాల ప్రమాణ స్వీకారం




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని జీకే రెస్టారెంట్స్‌లో మండల తెలుగుదేశం గ్రామస్థాయి కమిటీ సమావేశం గురువారం ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అరికట్ల జనార్ధన్ నాయుడు అధ్యక్షతన మండల కన్వీనర్ దేవరాల గంగాధర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. మండల కన్వీనర్‌గా మండల కన్వీనర్‌గా అధికారికంగా దేవరాల గంగాధర్ ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఆయనతోపాటుగా తెలుగుదేశం పార్టీ మండల, క్లస్టర్ స్థాయి, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, గ్రామస్థాయి, బూత్ స్థాయిలో ఎంపికైన సభ్యులచే ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతుందని అన్నారు. అంతేకాకుండా ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల టిడిపి మాజీ కన్వీనర్ శాఖమూరి నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు కోనంకి శ్రీనివాసులు నాయుడు, భీమవరం సొసైటీ ప్రెసిడెంట్ ఎర్రమల చిన్నారెడ్డి, బూదవాడ సొసైటీ ప్రెసిడెంట్ వనిపెంట సుబ్బారెడ్డి, చాబోలు సర్పంచ్ పుట్టం శ్రీనివాసులు రెడ్డి, మండల, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల పరిశీలన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని బాలాజీనగర్లో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఎంపీడీఓ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీబీవో మోహన్రావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధులు. నివాసాల్లో సేకరించిన చెత్తను క్రమం తప్పకుండా డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కాలువల్లో ప్లాస్టిక్, ఇతరత్రా వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో కరీముల్లా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోలాహలంగా టీడీపీ కార్యవర్గప్రతినిధుల ప్రమాణస్వీకారం





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో గురువారం త్రికోటేశ్వర కళ్యాణమండపంలో తెలుగుదేశం మున్సిపల్, వార్డు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలకు ఎన్నికైన ప్రతినిధుల ప్రమాణస్వీకార కార్యక్రమం అత్యంత కోలాహలంగా జరిగింది. పరిశీలకులుగా నెల్లూరు నగర తెలుగుదేశం నాయకుడు జాకీర్‌హుస్సేన్ హాజరయ్యారు. తొలుత పట్టణ టిడిపి అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి ప్రమాణస్వీకారం చేయగా జాకీర్‌హుస్సేన్, చంద్రారెడ్డి, రాష్ట్ర టీడీపీ నాయకులు పులిమిశైలజారెడ్డి తదితరులు అన్నికమిటీల ప్రతినిధులచేత ప్రమాణపత్రం పలికించి ప్రమాణస్వీకారం చేశారు. వారందరికీ పార్టీ కండువాలు, శాలువాలతో సన్మానించి బాధ్యతలగురించి వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్ సర్దార్, సీనియర్ తెలుగుదేశం నాయకుడు కేతా విజయభాస్కరరెడ్డి, స్థానిక సిండికేట్ రైతుసేవా సహకార సంఘ చైర్మెన్ పరిటాల సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ దోర్నాదుల సురేష్‌బాబు, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, పట్టణ తెలుగుమహిళ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి, పట్టణ టిడిపి ప్రధానకార్యదర్శి తోడేటి వెంకటయ్య, కౌన్సిలర్ గౌస్‌బాషా, పట్టణ టీడీపీ మైనారిటీసెల్ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, తదితరులు ప్రసంగించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, రాష్ట్ర టిడిపి లీగల్‌సెల్ కార్యదర్శి ఎల్.వి.రమణయ్య, కౌన్సిలర్లు మాదాల శ్రీనివాసులునాయుడు, గంధళ్ళ వేణు, మహబూబ్‌బాషా, టిడిపికి చెందిన వివిద స్థాయి నాయకులు చెరుకూరు పద్మావతమ్మ, గోరీ షబ్బీర్, కొప్పోలు చిన్నపురెడ్డి, కిన్నెర నరశింహరావు (శ్రీపెనుశిలనరశింహకోన ఫెస్టివల్‌కమిటీ సభ్యులు), నాగులూరు చిన్నబ్బయ్య, పఠాన్ చాంద్‌బాషా, పల్లవోలు జయాకర్, వడ్లమూడి వజ్రమ్మ, కోటేశ్వరమ్మ, చిట్టమూరు వెంకటేశ్వర్లురెడ్డి, దాసరి మధుసూధనరావు, దాసరి బాలకృష్ణ, కాపా వెంకటసుబ్బయ్య, చిన్నా, హయత్‌బాషా, తోట సందీప్, అంబటి నాగేశ్వరరావు, పొన్నూరు హజరత్తయ్య, ప్రదీప్‌రెడ్డి, ఉసురుపాటి బాలకొండయ్య, సాగర్, ఒంటేరు మల్లికార్జున, నాగులూరు శ్రీనయ్య, గౌరిపర్తి నాగభూషణమ్మ, పట్టణ, వార్డు, యూనిట్, క్లస్టర్, బూత్‌కమిటీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన కాలనీల దత్తతుపై సోమిరెడ్డి సమీక్ష

**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** పీ4లో భాగంగా సర్వేపల్లి నియోజకవర్గంలోని గిరిజన కాలనీలను దత్తత తీసుకున్న పామాయిల్ కంపెనీల ప్రతినిధులతో గురువారం నెల్లూరులోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ గంగాభవానీతోపాటు ఎంపీడీఓలతో కలిసి కంపెనీల ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించిన సోమిరెడ్డిసమీక్ష నిర్వహించారు. మల్లికార్జునపురంలో 280 గిరిజన కుటుంబాలను దత్తత తీసుకున్న ఎస్ఈఐఎల్ కంపెనీ అందించిన ప్రత్యేక కిట్ల గురించి చర్చించారు. ఎస్ఈఐఎల్ కంపెనీ తరహాలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బ్రహ్మదేవం గిరిజన కాలనీలో జెమినీ కంపెనీ రూ.93 లక్షలతో పనులను ప్రారంభించిన నేపథ్యంలో మిగిలిన కంపెనీలు కూడా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని సూచించారు. పారిశ్రామికంగా అభివృద్ధి



చెందుతున్న ముత్తుకూరు ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి సహకరించాలని కంపెనీ సీఈఓ జన్మేజయ మహాపాత్ర, సీఎస్ఆర్ హెడ్ రఘురామ్‌ను సోమిరెడ్డి కోరారు.

# క్రమశిక్షణ కలిగిన పార్టీ తెలుగుదేశం

● కార్యకర్తలే గుండెకాయ ● అభివృద్ధే అజెండా : టీడీపీ నేత జాకీర్‌హుస్సేన్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీ, క్రమం తప్పకుండా సంస్థాగత ఎన్నికలు నిర్వహించే పార్టీ, టీడీపీకి కార్యకర్తలే గుండెకాయ అని, పార్టీకి అభివృద్ధే అజెండా, సంక్షేమం సంకల్పమని నెల్లూరు నగర టీడీపీ నాయకుడు, ఆత్మకూరులో టిడిపి కార్యవర్గాల ప్రమాణస్వీకారానికి పరిశీలకులుగా విచ్చేసిన జాకీర్‌హుస్సేన్ పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని త్రికోటేశ్వర కళ్యాణమండపంలో గురువారం నిర్వహించిన ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని మున్సిపల్, వార్డు, క్లస్టర్, యూనిట్ తదితర కార్యవర్గాలకు ఎన్నికైన నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన విచ్చేసి అందరిచేతా ప్రమాణం చేయించన అనంతరం ప్రసంగించారు. ప్రజలగుండెచప్పుడుగా దివంగత ఎన్‌టి రామారావు తెలుగుదేశంను ప్రారంభించారని, ఆయన ఆశయసాధనలో చంద్రబాబు పార్టీని కొనసాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు అధికారంలో ఉంటూ అటు ప్రభుత్వపరంగా అభివృద్ధి, ప్రజాసంక్షేమం రెండు కళ్ళుగా ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని, ఇటు పార్టీ పటిష్టతకు, కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఆయన పేర్కొ న్నారు. దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిరంతరం ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి కృసిచేస్తుంటారని, గతంలో ఆయన వేలాదికోట్ల రూపాయలతో అభివృద్ధి సాధించారని, ఇపుడు కూడా ఈ17 నెలల్లోనే అనూహ్యంగా అభివృద్ధి సాధించారని, ఆత్మకూరు ప్రజల అదృష్టం ఆనం ఇక్కడ ప్రజాత్రినిధిగా ఉండడం అని జాకీర్‌హుస్సేన్ పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం చేసిన తుమ్మల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. తానే మళ్ళీ పట్టణ అధ్యక్షుడుగా అవకాశం కల్పించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలని, తనకు అవకాశం లభింపజేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, మంత్రి లోకేష్‌కు, ఆత్మకూరు మున్సిపాలిటీలో సహకరించిన 23వార్డుల టీడీపీ నాయకులకు ప్రృతేక ధన్యవాదాలని చంద్రారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్ సర్దార్, సీనియర్ టీడీపీ నాయకుడు కేతా విజయభాస్కరరెడ్డి, స్థానిక సిండికేట్ రైతుసేవా సహకార సంఘ చైర్మెన్ పరిటాల సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ దోర్నాదుల సురేష్‌బాబు, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, పట్టణ తెలుగుమహిళ అధ్యక్షు రాలు, కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి, పట్టణ టీడీపీ ప్రధానకార్యదర్శి తోడేటి వెంకటయ్య, కౌన్సిలర్ గౌస్‌బాషా, పట్టణ టీడీపీ మైనారిటీసెల్ అధ్యక్షుడు ఖాదర్‌బాషాలు ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దావా పెంచలరావు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, రాష్ట్ర టీడీపీ లీగల్‌సెల్ కార్యదర్శి ఎల్‌వి.రమణయ్య, కౌన్సిలర్లు మాదాల శ్రీనివాసులు నాయుడు, గంధళ్ళ వేణు, మహబూబ్ బాషా, టిడిపికి చెందిన వివిద స్థాయి నాయకులు చెరుకూరు పద్మావతమ్మ, గోరీ షబ్బీర్, కొప్పోలు చిన్నపురెడ్డి, కిన్నెర నరశింహరావు (శ్రీపెనుశిలనరశింహకోన ఫెస్టివల్‌కమిటీ సభ్యులు), నాగులూరు చిన్నబ్బయ్య, పఠాన్ చాంద్‌బాషా, పల్లవోలు జయాకర్, వడ్లమూడి వజ్రమ్మ, కోటేశ్వరమ్మ, చిట్టమూరు వెంకటేశ్వర్లురెడ్డి, దాసరి మధుసూధనరావు, దాసరి బాలకృష్ణ, కాపా వెంకటసుబ్బయ్య, చిన్నా, హయత్‌బాషా, తోట సందీప్, అంబటి నాగేశ్వరరావు, పొన్నూరు హజరత్తయ్య, ప్రదీప్‌రెడ్డి, ఉసురుపాటి బాలకొండయ్య, సాగర్, ఒంటేరు మల్లికార్జున, నాగులూరు శ్రీనయ్య, గౌరిపర్తి నాగభూషణమ్మ, పట్టణ, వార్డు, యూనిట్, క్లస్టర్, బూత్‌కమిటీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నరకయాతనగా నల్లపురెడ్డిపల్లి రోడ్డు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో నల్లపురెడ్డిపల్లి రోడ్డుగా పిలువబడే మూడు గ్రామాల రహదారి దశాబ్దకాలంగా ప్రజలకు నరకం చూపుతోంది. ఈరోడ్డు అడుగడుగునా పెద్ద గుంటలు పడి తీవ్ర అసౌకర్యంగా ఉంది. కనుపూరుపల్లి, మురుగుళ్ళ, నల్లపురెడ్డిపల్లి గ్రామాల ప్రజలు ఈరోడ్డు పై ప్రయాణం చేయడం అత్యంత ఇబ్బందికరంగా ఉంటోంది. ఈమూడు గ్రామాల వారు దశాబ్దకాలంగా తమ వేదనను వినిపిస్తూనే ఉన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు తమ అవస్థలు వివరిస్తూనే ఉన్నారు. కాగా రెండేళ్ళక్రితం ఈరోడ్డుకు మరమ్మత్తులు అంటూ జెసిబితో రోడ్డును పెకలించారు. దాంతో గుంటల కాస్తా తీవ్రమై మరింత ఇబ్బందికరంగా మారింది. ద్విచక్రవాహనకారులు మరింతగా ఇబ్బందిపడుతున్నారు. ఆమార్గంలో బస్ లేకపోగా ఆటోలు అధికంగా నడుస్తుంటాయి. ఆటోల డ్రైవర్లు, అందులో పయనించే ప్రయాణీకుల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఎన్నికల సమయంలో ఆగ్రామాలకు ఏ ప్రతినిధి వచ్చినా తమ రోడ్డు దుస్థితి, తమ అవస్థలు వివరిస్తూనే ఉన్నారు. ఆసమయంలో వారు హామీలివ్వడమే తప్ప రోడ్డుకు మరమ్మత్తులు మాత్రం చేయడంలేదు. దాంతో ఎంతకాలం తమ అవస్థలు అని వారు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి ప్రదాతగా నాడు-నేడు పేరుగాంచిన రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈరోడ్డుపై కాస్తంత దృష్టిసారిస్తే తమ సమస్యలు వెంటనే తొలగిపోతాయని, ఆయన వెంటనే శ్రద్ధచూపాలని మురుగుళ్ళ, కనుపూరుపల్లి, నల్లపురెడ్డిపల్లి గ్రామాలవారు, ఆమార్గాన వెళ్ళే ఇతర ప్రాంతాలవారు కోరుతున్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై ఆత్మకూరు బైపాస్‌రోడ్డు అభయాంజనేయస్వామి ఆలయం సమీపంలో గురువారం తెల్లవారుఝామున ఓ గుర్తుతెలియనివాహనం ఢీకొనడంతో ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడని ఎస్ఐ జిల్లాని పేర్కొన్నారు. తమకు సమాచారం అందగానే ప్రాధమిక విచారణ జరుపగా ఆత్మకూరు వైపునుండి సంగం వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం రోడ్డుపై వాటర్‌బాటిల్స్ సేకరించుకుంటూ వెళుతున్న ఒక పురుషుడిని ఢీకొందని, ఆయన అక్కడిక్కడే మృతిచెందాడని ఎస్ఐ పేర్కొన్నారు. మృతదేహం పూర్తిగా నలిగిపోయి ఉందని, శరీరవిడిభాగాలు విడిపోయి గుర్తించలేని స్థితిలో ఉందన్నారు. సదరు వ్యక్తికి సంబంధించి బంధువులు కానీ స్నేహితులు కానీ తమ పోలీస్‌స్టేషన్‌లో సంప్రతించాలని ఆయన కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ జిలానీ తెలిపారు.

## తప్పులు లేని ఓటర్ల జాబితా తయారుకు సహకరించాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో తప్పులుతడకలు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా నవీకరణకు అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మురళి పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల తహసీల్దారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా వింజమూరు మండలం కాటేపల్లి పోలింగ్ కేంద్రం- 143ను వన్నూరప్పపాళెంకు మార్చేందుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా 2025 ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో సరి చూసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించడంతోపాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ నీహా, రాజకీయ పార్టీల నాయకులు బయ్యన్న, ఉండేలా గురవారెడ్డి, చంద్ర మదు. చింతల శ్రీనివాసులు, నరసింహులు, వెంకటేశ్వర్లు, ఏఈఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కమిషనర్‌ను ఘనంగా సన్మానించిన కార్మిక సిబ్బంది

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో గత ఏడు సంవత్సరాలుగా సానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న డీవీ నాగేశ్వరరావుకు కమిషనర్‌గా పదోన్నతి పొందారు. గత ఏడు సంవత్సరాల కాలంలో కావలిలో తాను సానిటరీ సెక్షన్‌లో చేసిన సేవ ఉన్నతమైనది. నిరంతరం ప్రజల ఆరోగ్యంపై పారిశుద్ధ్య ప్రభావం ఎక్కువగా చూపుతోందని ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా వర్షాల్లో, ఎండల్లో, తుఫాన్లలో తను నిరంతరము కావలి పట్టణ ప్రజల కోసం శ్రమిస్తున్న వ్యక్తి సానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా డీవీ నాగేశ్వరావు అలాగే పాత ఊర్లో మస్టర్ సెంట్‌లో ఉన్న పార్కును అభివృద్ధి చేసిన ఘనత కూడా తనకే దక్కింది. తను చేసిన సేవలకు ఇటీవల కాలంలో కావలి అధికారులకు అవార్డులు రావడం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకోవడం కూడా చూసాం. అదేవిధంగా డివి నాగేశ్వరరావు కావలి పట్టడానికి చేసిన సేవలను తాను కమిషనర్‌గా పదోన్నతి పొందడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా సూర్య ప్రతినిధితో తెలిపారు. అలాగే నేను ఉన్నంతకాలంలో కార్మికులకి సమ న్యాయం చేశానని తెలిపారు. సానిటరీ సెక్రటరీ మస్తాన్ మాట్లాడుతూ, కావలి పట్టణానికి సానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా డివి నాగేశ్వరరావు వచ్చి ఏడు సంవత్సరాల కావస్తుందని ఈ ఏడు సంవత్సరాల్లో కావలి పట్టణాన్ని పరిశుద్ధంగా తీర్చిదిద్ది పారిశుద్ధ్య



కార్మికులు లేకపోయినప్పటికి ఫిర్యాదు వస్తే తనే స్వయంగా వెళ్లి ఆ సమస్యను పరిష్కరించే వారిని వారు తెలిపారు. తాను చేసిన శ్రమ మొన్న కావలి పట్టణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదగా క్యాంపు కార్యాలయంలో అవార్డులు అందుకోవడం జరిగిందని, ఇంత మంచి వ్యక్తికి ప్రమోషన్ రావడం తను చేసిన సేవలకు దేవుడు పదోన్నతి కల్పించారని తెలిపారు. అనంతరం కార్మికులు హర్షద్వానాల మధ్య తనును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలో ఉన్న పారిశుద్ధి కార్మికులు సెక్రెటరీ, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

# మరణించిన కండక్టర్ కుటుంబానికి పరామర్శ



- గాయపడ్డ మెకానిక్‌కు సహాయ భరోసా
- ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి

**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** విధినిర్వహణలో మరణించిన కుటుంబాన్ని ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కుటుంబంలో జరిగిన రెండు దురదృష్టకర సంఘటనలను చూసి చాలా బాధగా ఉంది. ఇటీవల డ్యూటీలో ఉండగానే అకస్మాత్తుగా మరణించిన వన్ డిపోకు చెందిన కండక్టర్ రాఘవయ్య కుటుంబాన్ని ఈరోజు ఎన్టీఆర్ నగర్‌లో కలిసి పరామర్శించి, కర్మంత్రంలో పాల్గొని, వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అందాల్సిన ప్రతి ప్రయోజనం తప్పకుండా అందేలా చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. అలాగే వన్ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్న నరసింహులు ఇటీవలి కాలంలో డ్యూటీలో ఉండగా తీవ్ర గాయానికి గురై కాలు కోల్పోయిన విషయం తెలిసి గుడపల్లిపాడు వద్ద ఆయన బంధువుల ఇంటికి వెళ్లి పరామర్శించాను. ఆయన ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని కోరుకుంటున్నాను. ఇప్పటికే ఆయన ఇన్సూరెన్స్ క్లెయిమ్ సంబంధిత పత్రాలను స్టేట్ బ్యాంక్–ఓరియెంటల్ ఇన్సూరెన్స్‌కు పంపించాం. త్వరలోనే క్లెయిమ్ మొత్తాన్ని పొందేలా సహకరిస్తాము. నరసింహులుకి రావాల్సిన అన్ని బెనిఫిట్స్‌ను ప్రభుత్వం నుంచి సమయానికి అందించేందుకు ఆర్టీసీ తరఫున పూర్తి బాధ్యత తీసుకుంటామన్నారు. మన ఆర్టీసీ సిబ్బంది ఏ ఇబ్బందుల్లో పడినా, వారి కుటుంబాలు ఒంటరిగా లేరన్న భావన కలిగించడం మా విధి అని సురేష్ రెడ్డి తెలిపారు.

# బీపీఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

## అనుమతులు మేరకే నిర్మాణాలు చేపట్టాలి : కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార లేఔట్ లో ప్లాట్ల యజమానులకు చట్ట బద్ధహక్కులు కల్పించే ఎల్ఆర్ఎస్ పథకం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనధికార లేఔట్‌లోని ప్లాట్ల యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం క్రమబద్ధీకరణ పథకం ఎల్ఆర్ఎస్ 2020ను సవరిస్తూ మరో మూడు నెలల పాటు అనగా తేదీ 23 జనవరి 2026 వరకు పథకాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులను జారీ చేసిందని తెలిపారు. తాజా ఉత్తర్వుల ప్రకారంగా ఈ ఏడాది జూన్ నెల 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేసిన ప్లాట్లు క్రమబద్ధీకరణకు అర్హత కలిగి ఉన్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను కొత్త నిబంధనల ద్వారా అనుమతించవచ్చని కమిషనర్ ప్రకటించారు. బీపీఎస్ పథకం ఎల్ఆర్ఎస్ పథకాలతోపాటు పట్టణ ప్రణాళిక విభాగంలో నూతన భవన నిర్మాణాల కోసం మార్గదర్శకాలను అత్యంత సరళీకృతం చేసి ఉన్నారని,



భవనాల యజమానులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని కూడా కార్యాలయంలో నిర్వహిస్తున్నామని కమిషనర్ తెలిపారు. పట్టణ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిల సూచనల మేరకు భవన నిర్మాణాలను తొలి దశలోనే గుర్తించి వాటికి సంబంధించిన అన్ని అనుమతులను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, నూతన భవన నిర్మాణదారులు తప్పనిసరిగా నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం నిర్దేశించిన మేరకు అనుమతులను పొంది అనుమతుల మేరకు మాత్రమే నిర్మాణాలను చేపట్టాలని కమిషనర్ సూచించారు.

# నేటి నుండి గ్రంథాలయ వారోత్సవాలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆత్మకూరు శాఖా గ్రంథాలయంలో నవంబర్ 14వ తేదీ నుండి 20 తేది వరకు నిర్వహించబడుతాయని లైబ్రేరియన్ ఓంకారం శ్రీనివాస రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి 20వ తేదీ ముగింపు సమావేశంలో పోటీలలో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథులు చేతుల మీదుగా బహుమతి ప్రధానం గావిస్థామన్నారు. ఈ సందర్భంగా 15వ తేదీ నుండి 20వ తేదీ వరకు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠక ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని శ్రీనివాసరాజు కోరారు.

# నారాయణ గోమతి సీబీఎస్ఈలో క్రీడా పోటీలు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని స్థానిక గోమతి నగర్ నారాయణ గోమతి సీబీఎస్ఈ కళాశాలలో నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీలు గురువారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నారాయణ విద్యాసంస్థల కోర్ డిన్ కే శ్రీనివాసరావు విచ్చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి సూచనల మేరకు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయి అని తమ కళాశాలలో విద్యార్థులకు చదువుతోపాటు వివిధ రకాల క్రీడా పోటీలు యోగ స్కిల్ డెవలప్మెంట్ వంటి కార్యక్రమాలు నిర్వహించి వారిని అన్ని రంగాలలో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలలో గెలుపొంది బ్రాంజ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సుధీర్ ఆర్ఐ ఆదిశేషయ్య, అధ్యాపకులు, పీఈటీ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్కూలు బ్యాగులు పంపిణీ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర మాజీమంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం నారికేల్లపల్లి గ్రామపంచాయతీలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు స్కూలు బ్యాగులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక వైసీపీ నాయకులు కాటంరెడ్డి వసంత్ కుమార్ రెడ్డి, కాటంరెడ్డి భాస్కర్ రెడ్డి, గ్రీష్మితా రెడ్డి, తులసి, పాతపాటి హేమంత్ రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత హాజరై విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. స్థానిక సర్పంచి కృష్ణవేణి, ఉప సర్పంచ్ కరుణాకర్, వైసిపి నాయకులు భాస్కర్, వైకాపా సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు గ్రామస్తులు హాజరయ్యారు. 200 మంది విద్యార్థులకు బ్యాగులు పంపిణీ జరిగింది. ఈ నేపథ్యంలో కాకాణికి గజమాలతో ఆత్మీయంగా సన్మానించారు. కార్యక్రమంలో పెంచల్ రెడ్డి, శివ, ప్రసాద్, ఇంద్రసేన గౌడ్, శరత్ రెడ్డి శివ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రసన్న వెంకటేశ్వర స్వామికి కార్తీక దీప పూజ



**నెల్లూరు కల్చరల్, మేజర్ న్యూస్ :** నెల్లూరు మాగుంట లేఔట్ లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు కార్తీక మాసం సందర్భముగా భక్తులు గురువారం ఉదయం నుండి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. కార్తీక మాసంలో శివుడు, శ్రీనివాసుడు ఇరువురికి ప్రీతికరం. భక్తులు భారీగా తరలివచ్చి ఉదయం నుండి కార్తీక దీపాలు వెలిగించి శ్రీవారిని స్మరించుకున్నారు. అనంతరం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి శ్రీవారిని దర్శించి తరించారు. ఆలయం వారు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసి వారికి తీర్థప్రసాదములు అందించారు.